# భైరవోపాఖ్యానం

## గల్పిక

"ఈ ప్రపంచ మంతా మిథ్య" అని ఓమూల కూచునే కొద్దిపాటి మందిని మినహాయిస్తే తతిమావాళ్ల కందరికీ తమతమ జీవితాల్లో అనంతాశయాలూ వాటిని సాధించాలనే పట్టుదలా, విజయాన్ని గురించిన మధుర స్వప్నాలూ తప్పవు. చేసుకోబోయే భార్యగురించీ, పుట్టబోయే కొడుకు గురించీ—రాగల మహదైశ్వర్యాలగురించీ మానవుడి బుర్ర సతతమూ ఆలోచిస్తోనే వుంటుంది. ఎవడేనా సరే జీవితంలో కొన్ని డక్కా-మొక్కీలు తిని చివరికి తనకు లాభించగల దేమీ లేదని రూఢి చేసుకున్నాక కూడా "నాది ఒట్టి దురదృష్ట జాతకం" అనుకోవటం—ఆశల్ని మరిచి పోలేక పోవటమే!

"మనుషు లందరికీ ఒకటే రకం అభిరుచులూ కోరికలూ వుంటే అస లింతమంది బ్రతకటమే అనవసరం" అంటున్నాడు సత్యనారాయణ.

ఆయన చెబుతూన్న ది ఎంతవరకు నిజమో నా కర్థం కాదు. ఒకటే రకం అభిరుచులు వున్న వాళ్లు మురాలుగా చేరి ఎంతమంది మనకు కనిపించటం లేదూ? వ్యక్తి ప్రాతినిధ్యం అంటే యిలాంటి దే గావును!

సత్యనారాయణ చెప్పొచ్చే వేదాంతంలో నాకట్టే నమ్మకం లేకపోయినా ఆయనలో మాత్రం వున్నదని ఒప్పుకుంటాను. అలాగని ఆయనేం చేసినా నేను తలూపె రైటంటూ ననటానికి లేదు. ఏమంటే—మే మిద్దరమూ కూడా యిలాంటి విషయాల్లో చాలాసార్లు భేదాభిప్రాయాలు ప్రకటించుకున్నాము.

ఏవేవో విషయాలమాట అట్లావుంచి, ఆయన కుక్కపిల్లను పెంచటంలో కూడా భేదాభిప్రాయాలు ప్రకటించుకోవటమే నాకు మరీ చోద్యంగా అనిపిస్తోంది.

"నన్నడిగితే కుక్కను పెంచటంకన్న మరో దరిద్రం లేదు-దాని మొహం చూట్టానికే దౌర్భాగ్యంగా వుండేమాటఅట్లావుంచి అది చేసే అసహ్యకరమైన పనులూ, ఘండాలమూ మనుషులకు భరించ శక్యంగాదు" అన్నాను.

"కుక్క వుండటంవల్ల అనేక ప్రయోజనాలున్నాయి—"అన్నాడాయన యికనైనా నేను కుతూహలంగా వినగలనన్న వూహతో. నా నిర్లక్ష్యానికి యేమీ కించవహించకుండానే కార్యశూరులు ప్రతిభావంతులుమరి! "ఒకటి!"అంటూ ప్రారంభించాడు. ఏరాత్రి యేదొంగ కొంపలో దూరినా కాస్త ఇంటిముందు కుక్క వుండటం-" అన్నాడు.

"ఇన్నాళ్ళూ మీ యింట్లో ఎందరుదొంగలు పడ్డారూ?"అన్నాను.

నా ప్రశ్నకాయన సూటిగా సమాధానం చెప్పలేకపోయినాడు. కాస్త తటపటాయించి, "అదేం ప్రశ్న? అట్లా ఆలోచిస్తే, మనం యీ సంసారాలు చెయ్యనే అక్కరలేదూ!"అన్నాడు.

"రెండూ-కాస్త కాలక్షేపానికి అనువుగా ఉంటుంది. తీరిగ్గా వున్నప్పుడు బొత్తిగా గోళ్లు గిల్లుకుంటూ కూచోనవసరం లేకండా—"

"సరి! తీరిగ్గా వున్నప్పుడు కుక్కతోనే వినోదించాలీ? కాస్త చదరంగం పరచినా నెలలు సంవత్సరాలూ గడిచే పోతాయే!" అన్నాను.

"దానిమీదా విసుగెత్తినప్పుడూ?"అన్నాడు.

నేనేమీ సమాధానం చెప్పకండా ఆయనేం చెప్పినా వినటానికి సిద్ధంగా కూచున్నాను.

సత్యనారాయణ చెప్పుకుపోయినాడు. సవాలక్షగ్రంథం అవుతుంది. ఆఖ్న అయాక "పోతే నష్టాలు యేమున్నాయో మీరు చెప్పండీ!" అన్నాడు.

"మంచి మీవొంతూ చెడు నావొంతునా?" అంటోనే మొదలెట్టాను—"వెధవది దాని అరుపు

"శ్రీవిరించి"

వినటమే నాబోటివాడికి కంటక ప్రాయంగా వుంటుంది. పోతే మలమూత్ర విసర్జనాదులకు దానికి పాకీదొడ్డి ఎటూ పనికిరాదు. మనం ఇలా సాగా కూచునేచోట, నట్టింటోనూ అదాపని చేస్తుంది. దాని అభ్యంతరం చెప్పటానికి లేదు. దాన్ని మన పిల్లలు తొక్కి యిల్లంతా వ్యాప్తం చేస్తారు ఇంకా...''

నాకడ్డంవొచ్చేసి "అలాటి చిక్కేం రాకండానే అది మలవిసర్జన చేసినప్పుడు వెంటనే దాసీదివొచ్చి ఎత్తేస్తుంది'' అన్నాడు.

"ఈ లోపల? దాసీది లేనప్పుడూ? ఇంకా అనేక చిక్కులున్నాయి. దానికిరోజూ అన్నం కలిపిపెట్టాలి. ఎవరు పెట్టేట్టు? దానికి బోలెడు గజ్జి మొదలైన అంటురోగాలు అంటుకుంటాయి అవి మన పిల్లలకుగూడా తగిలితే ప్రమాదం కాదా?"

"నువ్వెన్ని కారణాలు వెదికి, వెదికి చెప్పినా అన్నింటికీ పరిహారాలు చెప్పగలను."

"ఆ! తరవాత ఇది బజారులో తిరిగి కొంప మీదికి బోలెడన్ని తగాదాలు తెస్తుంది. ఎవడి కుక్కనో వెంటబడి వేధిస్తుంది. ఏదో కథలో లాగ ఎవడి వేలో కసిక్కిన కొరుకుతుంది. ఎవడు దాచుకున్న కూడో కాజేస్తుంది!''

"అట్లా చెయ్యటానికి మనం దీన్ని గడప దాటి అవతలికిపోనిస్తే గదా? అదీ మనతోపాటే ఇంటిదగ్గరేవుంటుంది" "దానికి ఓ గది ప్రత్యేకంగా వుంచి పెంచితే యిక అది యిల్లు కాపలా కాయటం యెవడు చేస్తాడు? మీరు కొనటంలో ముఖ్యోద్దేశ్యం అదేకదా!—''

ఇట్లా నేను బోలెడన్ని సంగతులు విడమర్చి చెప్పాను. ఎవడు ఆలోచించినా తెలుసుకోలేని పరమసత్యాలు చెప్పిచూశాను. సత్యనారాయణ గారు యే వొక్క కారణానికైనా లొంగక పోతాడా అని చూచాను.

ఇంతగా నేనెందుకు చెప్పవలసి వచ్చిందంటే, విషయం యెట్లాంటిదయినా మన అభిప్రాయాలు మనం జంకుగొంకు లేకండా బయటపెట్టాల్సిందే అన్న వూనికే!

చిట్ట చివరికి సత్యనారాయణ గారు కుక్క పిల్లని కొంటానికే నియించారు. నేను "చెప్పవలసింది చెప్పేశాను. నా అభిప్రాయం తెలపర్చ నన్నమాటే గాని మిమ్మల్నిట్లా చెయ్యమని బలవంతం చేస్తున్నాననుకోకండి! ఎవరికయినా అనుభవంమీదగాని కొన్ని సంగతులు తెలిసి రావు."

"అదెంత మాట?" అన్నాడాయన. నేను మాట్లాడకండా వూరుకున్నాను.

తరువాత నాలుగు రోజులకి నేను ఆయన యింటికి వెళ్ళటం తటస్థించింది. ఆయనెందుకో ముఖం ముడుచుకు నుండటం గమనించాను.

"మొన్న మనం చర్చించాం చూశారా" అంటూ ఆయన మొదలెట్టాడు.

నాకోపట్టాన విషయం గుర్తుకు వచ్చిందికాదు. "కుక్కసంగతి! కొన్నా. చనువుకొద్దీ గొలుసు వెయ్యకండా వుంచితే—''అని ఆగారు.

నేనే కలగచేసుకుని "ఏమయిందీ?" అనడగాల్సి వచ్చింది.

"ఏమయినదంటారా?"—అంటూ ఆయన మొదలెట్టాడు, యీ విషయంలో తనకేమీ స్వకుతూహలం' లేనట్టూ, కేవలం నే నడగబట్టే చెబుతూన్నట్టూ—"అది పారిపోయింది!"

విషయం ఆగిఆగి చెప్పటంలో ఆయనకున్న ఆనందం మధ్యలో చెడగొట్టటం అమానుషమని వూరుకున్నాను.

"వెదికించాను! రెండు రోజులు వెదికినమీదట అది ఒక యింట్లో దొరికింది. ఆ కుక్కపిల్లే యిదీ అనటానికి సందేహం యేమీలేదు. పైగా ఆ ఇంటి ఆసామీ కూడా అన్నాడు, 'యిది నాకెక్కడో దొరికింది. రోజుల్లా చూచాను ఎవరన్నా వస్తారేమోనని! చివరికి యింట్లో పాత గొలుసుంటే ఒకటి తీసి కట్టాను!—తీసుకువెళ్లండి' అని.

తెచ్చి యింట్లో కట్టించాము. తిరిగి ఆ రాత్రే అది తప్పించుకుపోయింది!" అన్నాడు.

"ఇంతేనా జరిగిన కథ" అన్నాను.

"చాలదా యేమిటి? ఇంకొకూ నన్ను బాధించే అనుమాన మేమిటంటే చక్కటి గొలుసుతో కట్టేశాంగదా, ఎక్కడికి తప్పించుకుపోయిందా-అని!"

"గొలుసుతో సహా పోలేదుకదా?"

"లేదు."

"మొదట్లో కుక్క దొరికిన ఆసామీదగ్గర గొలుసొకటి వుందన్నారు కదూ?"

"ఆ!"

"అయితే కుక్క అక్కడ మళ్ళీ దొరకలేదన్న మాట!"

"లేదు—"

"కుక్క ఖరీదెంత?"

"అంటే?"

"ఎంత యిచ్చికొన్నారూ? అని"

"ఎనిమిది!"

"ఎనిమిది?" అన్నాను మళ్ళీ.

తరవాత యీ ప్రసక్తి నాదగ్గర ఆయనగానీ ఆయనదగ్గర నేనుగానీ తేవటం పడలేదు.

స్కెచ్

# కాంక్ష

"హితశ్రీ"

ఎస్. మురళీధరరావు అనే వ్యక్తితో నాకు పరిచయం అయేదాకా, అర్థంకాని వ్యక్తులంటూ కొంతమంది ఉంటారని నాకు తెలియదు. ఈ వ్యక్తిని గురించి తల బద్దలుకొట్టుకునే అగత్యం అనవరతమూ కలుగుతుందని ముందే తెలుస్తే అతనితో అంత పరిచయం కలిగించుకోనక పోయే ఉందును. పరిచయం అయిన తరవాత అతనిని తప్పించుకుని తిరగాలిసిన ఆవశ్యకత చాలామట్టుకు కలిగింది. లేకపోతే, బుద్ధిపూర్వకంగా మెదడు పాడు చేసుకోవాలని ఎవరు కోరుకుంటారు? అయితే తప్పించుకు తిరగటమనేది ఇద్దరికీ సంబంధించిన విషయం. నా చేతిలో పనైతే నేను చేస్తూనే ఉన్నానుగాని అతను సులభంగా అది నెరవేరనిచ్చేట్లు లేడు. మురళీధరరావుని ఆ రోజు పొద్దున గుమ్మంలో చూడగానే నాకు కలిగిన మనోభావం అదీ. అతను పూర్తిగా ఇంటిలోకి అడుగుపెట్టకుండానే చేతిలోని పేపరు నామీదికి విసిరేస్తూ అన్నాడు ఉత్సాహంగా. "చూశావా, ఫస్టుప్రైజు పదిహేను వేలుట-ఎస్. మురళీధరరావు."

"నువ్వేనా?" అన్నాను చాలా యధాలాపంగా.

"కాకపోతేమటుకేం?"

"అయితే నీకెందుకంత ఉత్సాహం?"

అతను ఏమీ మాటాడకుండా తాపీగా కుర్చీలో కూచున్నాడు.

"దీనికోసమేనా ఇంత హడావుడిగా పరుగెత్తుకొచ్చావు?"

"నీకు చెబితే అర్థంకాదులే."

"అర్థం ఉంటేగా, కావటానికి."

"టీపార్టీ ఇప్పిస్తానులే."

"ఎవరికో ప్రైజురావటమేమిటి, మధ్య నీకూ నాకూ టీపార్టీ ఏమిటి? అదైనా నీ సొంతఖర్చు మీద!"

మురళీధరరావు నవ్వాడు. అది భావయుక్తం అని వాడి అభిప్రాయం.

"ఈ ఏడు చెస్ ఛాంపియన్‌షిప్ ఎవరిదో తెలుసా? మధ్య పేజీ తిప్పు."

తిప్పాను.

"ఎస్. మురళీధరరావు, నువ్వు కాదుగా."

కొంచెం అనుమానంగా అడిగాను.

"నాకు చెస్ ఆట ఎలాఆడాలో తెలిస్తేగా?" నవ్వాడు.

"నువ్వు ఎరుగుదువా అతన్ని?"

"నీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు."

"మరి, అంత సంతోషం ఎందుకు నీకు? అతని ఆరాధకుడివా?"

మురళీధరరావు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ విననివాడిలా పైకిచూసి, కాసేపాగి హఠాత్తుగా లేచి నుంచున్నాడు.

"పద, పోదాం. ఇవాళ రెండు సంతోషకరమైన వార్తలు, తప్పక నీకు కాఫీ ఇప్పించాలి."

అతనివాలం చూసి నాకు వొళ్లు మండింది. అయినా ఊరికే పరాయి ఖర్చుమీద కాఫీ రావటం అనేది నాకు సామాన్యంగా అసామాన్యం కనుక తిరస్కరించటానికి బుద్ధి పుట్టక అతనితో బయలుదేరాను. కాఫీ తాగింతరవాత ఇంటికి రమ్మని బలవంతం చేశాడు. వెంటనే కృతఘ్నత తెలియచెయ్యటం అమర్యాదకరమని తప్పనిసరిగా అతనిని అనుసరించాను. పది నిమి